


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 106 గురువారం 17 సెప్టెంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

# తిరుమలలో రాష్ట్ర ముఖ్యమంత్రి మీడియా సమావేశం



రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో గల సుధర్మ సమావేశ మందిరంలో మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు శ్రీ ఆనం రామనారాయణరెడ్డి, శ్రీ అనగాని సత్య ప్రసాద్, టీటీడీ చైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు, ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్, టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, టిటిడి జేఈవోలు డా ఎ. శరత్, శ్రీ గోపీనాథ్ ,ఎస్పీ శ్రీ సుబ్బరాయుడు, సివిఎస్వో శ్రీ కే వి మురళీకృష్ణ ఇతర ప్రజా ప్రతినిధులు, టీటీడీ బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మిగతా2లో

## ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు.. ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?

- చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు
- ఎఫ్‌బీఐగా నటిస్తూ ఏపీ పోలీసులు సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని కోరారని వెల్లడి
- ఇది ప్రభుత్వ ప్రాయోజిత మోసమంటూ జగన్ విమర్శ
- ఈ చర్యతో ఏపీ పరువు తీశారంటూ మండిపడ్డ మాజీ సీఎం
- హామీల అమలుపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి హితవు

ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "చంద్రబాబు గారి రెడ్ బుక్ పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు"

మిగతా2లో





## ఈ వాస్తవాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారు : దాసరి శ్యామ్ చంద్రశేషు

- ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి దృష్టి మళ్లించడానికే డీఎస్సీపై జగన్ ఆరోపణలు
- 98% అవకతవకలు జరిగిన ఏపీపీఎస్సీ స్కాంపై సీబీఐ విచారణకు జగన్ సిద్ధమా అని ప్రశ్న
- పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై 323 కేసులు వేసినా కోర్టులు కొట్టివేశాయని వెల్లడి
- అభివృద్ధి పనుల ఘనతను జగన్ తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శ
- దిగజారుడు రాజకీయాలు చేస్తే వైసీపీకి ఉన్న 11 సీట్లు కూడా దక్కవని హెచ్చరిక

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీలో జరిగిన భారీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే మాజీ ముఖ్యమంత్రి జగన్ మెగా డీఎస్సీపై నిరాధార ఆరోపణలు చేస్తూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు తీవ్రంగా ధ్వజమెత్తారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, డీఎస్సీపై విషం చిమ్ముతూ నిరుద్యోగులను అయోమయానికి గురిచేయాలని జగన్ చూస్తున్నారని మండిపడ్డారు.

మిగతా2లో

## లక్ష్యాలు చేరకపోతే ఈ సమావేశాలెందుకు ఎస్ఎల్‌బీసీ సమావేశంలో చంద్రబాబు

- 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం
- అన్ని వర్గాలను బలోపేతం చేసేలా రుణాలు అందించాలని బ్యాంకర్లకు చంద్రబాబు సూచన
- రుణాల మంజూరులో కొన్ని బ్యాంకులు వెనుకబడటంపై సీఎం అసంతృప్తి
- రుణాల చెల్లింపులో ఎస్హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 అని ప్రశంస
- పీఎం సూర్యఘర్ పథకానికి పెద్దఎత్తున రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- కౌలు రైతులకు రుణసాయం పెంచాలని బ్యాంకులకు దిశానిర్దేశం

మిగతా2లో

రాష్ట్రంలోని అన్ని రంగా లను, వర్గాలను బలోపేతం చేసేలా రుణాలను అందిం చాలని, లక్ష్యాలను చేరుకో వడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



## స్థానిక ఎన్నికల కోసం చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు

- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే చంద్రబాబు సంక్షేమ డ్రామా ఆడుతున్నారని వైసీపీ విమర్శ
- కొత్త ప్రభుత్వం వచ్చాక అర్హులకు పెన్షన్లు ఇవ్వడం లేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపణ
- దాదాపు 6 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులను తొలగించారని విమర్శ
- జగన్ తెచ్చిన జీవోతోనే అసైన్డ్ భూములకు హక్కులు దక్కుతున్నాయని వెల్లడి
- కేంద్రం కేటాయించిన ఇళ్లు నామమాత్రమేనని వ్యాఖ్య



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలపై బూటకపు ప్రచారం చేస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం, జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు ఇప్పుడు ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది.తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం

మిగతా2లో

## బీసీ రిజర్వేషన్లపై తీర్పు రిజర్వ్ చేసిన ఏపీ హైకోర్టు.. తీర్పుపై సర్వత్రా ఆసక్తి!

- స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో విచారణ
- ప్రభుత్వ జీవోలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై వాదనలు పూర్తి
- రిజర్వేషన్ల ఖరారుపై ప్రభుత్వానికి పలు కీలక ప్రశ్నలు సంధించిన ధర్మాసనం
- రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికను పరిశీలిస్తామన్న కోర్టు
- అన్ని నివేదికలు చూశాకే తుది నిర్ణయమంటూ తీర్పును రిజర్వ్



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలపై దాఖలైన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు విచారణను ముగించింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ వ్యవహారంపై తన తీర్పును రిజర్వ్ చేసింది. ప్రభుత్వ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం ప్రకటిస్తామని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఇటీవల 1065, 105 జీవోలను జారీ చేసింది. అయితే, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల మొత్తం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా నిర్దేశించిన 50 శాతం పరిమితిని

మిగతా2లో

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# తిరుమలలో రాష్ట్ర ముఖ్యమంత్రి మీడియా సమావేశం

తిరుమల, 2026 సెప్టెంబర్ 16:: రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో గల సుధర్మ సమావేశ మందిరంలో మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు శ్రీ ఆనం రామనారాయణరెడ్డి, శ్రీ అనగాని సత్య ప్రసాద్, టీటీడీ చైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు, ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్, టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, టిటిడి జేఈవోలు డా ఎ. శరత్, శ్రీ గోపీనాథ్ ,ఎస్పీ శ్రీ సుబ్బరాయుడు, సివిఎస్వో శ్రీ కే వి మురళీకృష్ణ ఇతర ప్రజా ప్రతినిధులు, టీటీడీ బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**మీడియా సమావేశంలోని ముఖ్యాంశాలు**

తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ వరకూ లింక్ చేసేలా స్కైవాక్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది
త్వరలోనే కేంద్ర సహకారంతో ఈ ప్రాజెక్టు చేపడతాం.
తిరుపతి లో ఇటీవల సేకరించిన 50 ఎకరాల్లో మల్టీస్టోరీడ్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం.
ఉద్యోగులకు ఇంటి జాగాల కు సంబంధిచి. మౌలిక సదుపాయాలు కల్పనకు రూ.230 కోట్లు వ్యయం అవుతుంది.
త్వరలోనే తిరుపతిని వివిధ హైవేలకు కనెక్టు చేసేలా కార్యాచరణ చేపడతాం
తిరుపతి కేంద్రంగా పెద్ద ఎత్తున ఎకనామిక్ యాక్టివిటీ జరగాలి.
శ్రీవారిని దర్శించుకోడానికి వచ్చే వారితో తిరుమల తిరుపతి సర్వీస్ హబ్‌గా మారుతుంది
తిరుమలతో పాటు తిరుపతిలోనూ శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవం కనపడాలి.
ఆధ్యాత్మికంగా ప్రజల్ని కలిపేందుకు ఈ ఉత్సవాలు అత్యంత కీలకం.
తిరుమలలో జరిగే కల్యాణాలకు అత్యంత విశిష్టత ఉంటుంది.
వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తిరుపతిని మార్చాలన్నది మా ఆలోచన
తిరుపతి, తిరుమల అంతా నెట్‌జీరో కాన్సెప్ట్ విధానంలోనే కార్యకలాపాలు నిర్వహించాలి
సౌర, పవన విద్యుత్ తో పాటు బ్యాటరీ స్టోరేజి ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరగాలి
ప్రతీ టీటీడీ భవనంపైనా సౌరవిద్యుత్ ప్యానళ్లు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నా
ప్రస్తుతం కోటి యూనిట్లు ఉత్పత్తి చేస్తుంటే 10 కోట్ల యూనిట్లు టీటీడీ వినియోగిస్తోంది
ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు సర్క్యులర్ ఎకానమీకి వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలి
పర్యావరణాన్ని కాపాడుకునేలా జీరో వేస్ట్ విధానం అమలు కావాలి. ఓ మోడల్ గా తిరుమల అభివృద్ధి కావాలి.
దేశంలోని అన్ని దేవాలయాల కంటే తిరుమల తిరుపతి అత్యంత పరిశుభ్రంగా చక్కటి నిర్వహణలో ఉంది
2300 ఏళ్ల నుంచి ఉన్న ఈ దేవాలయం ప్రపంచంలోనే అత్యుత్తమ దేవాలయంగా ఉండాలి
అత్యంత సేవాభావంతో నిర్వహిస్తున్నాం కాబట్టే దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా భక్తులు ఇక్కడికి వస్తున్నారు.
టిటిడిలో ఎస్వీ అన్నదానం ట్రస్ట్ కు దాదాపు రూ.3,165 కోట్లు కార్పస్ ఫండ్ ఉంది. భవిష్యత్తులో అన్నప్రసాదాలు మరింత మెరుగ్గా అందించేలా చర్యలు
అదేవిధంగా, ప్రాణదానం ట్రస్ట్ క్రింద రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు. స్విమ్స్, బర్డ్, రుయా, సెంట్రల్ హాస్పెటల్, కార్డియాలజీ ఆసుపత్రులను అనుసంధానం చేసే దిశగా అధికారులకు సూచించాం. వీటితో పాటు మానవ సేవయే మాధవ సేవ అన్నట్లు శ్రీవారి వైద్య సేవలను విరివిగా అందించేలా పటిష్ఠ చర్యలు చేపట్టాం. నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ తో సమన్వయం చేసుకునేలా తిరుపతిలో అరవిందో, క్యాన్సర్ ఆసుపత్రులను అనుసంధానం చేసేలా చర్యలకు సూచించాం.
అదేవిధంగా, శ్రీవారి సేవలో కల్చరల్ ప్రోగ్రాంలు, కల్చరల్ వింగ్ లను ఏర్పాటు చేయమన్నాం.
టిటిడి విద్యాసంస్థల్లో ముఖ్యంగా పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు చేసి ఉపాధికి శిక్షణ
వృక్ష గోవిందం కార్యక్రమంలో భాగంగా చెట్లు నాటే కార్యక్రమంను రూపొందించామన్నాం.
తిరుపతిని ఆధ్యాత్మిక హబ్ గా మార్చేలా ప్రణాళికలు.
దాదాపు 5 వేల ఆలయాలను నిర్మాణం, ఉన్న ఆలయాలకు అవసరమైన చోట పునర్ నిర్మాణం చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించాం.
శిష్ట రక్షణ– దుష్ట శిక్షణ అనేది స్వామివారే చూసుకుంటారు.
టిటిడి ఆధ్వర్యంలో ఉన్న 65 ఆలయాలను ఏ బీ సీ కేటగిరీలుగా విభజించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయమన్నాం. అదేవిధంగా,
శ్రీవారిఆస్తులు, ఆభరణాలు, బంగారం, నిధులు, భూములుఇలాఅన్నివివరాలుఆన్లైన్లో ఉంచేలా చర్యలకు ఆదేశం.
మారిషస్, న్యూజిలాండ్ లాంటి దేశాల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించాలని అడుగుతున్నారు. దీని గురించి కూడా ఆలోచన చేస్తున్నాం.
దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ శ్రీవారి ఆలయాలు నిర్మించాలని కోరుతున్నారు
వచ్చే ఏడాదికి సోమశిలకు, ఆపై కండలేరు బాలాజి సాగర్‌కు నీరు తీసుకొస్తాం. వచ్చే ఏడాదికి కల్యాణి డ్యామ్ కు కూడా నీటిని తరలిస్తాం
ఓ మారు తీవ్ర వర్షాభావం కారణంగా దేవాలయం మూసివేయాలన్న ప్రతిపాదన వచ్చింది.
కల్యాణి డ్యామ్ నుంచి పైపులైన్‌ను వంద రోజుల్లో వేసి తిరుమలకు నీరు తరలించాం.
టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారిచే జారీ చేయబడింది.

## లక్ష్యాలు చేరకపోతే ఈ సమావేశాలెందుకు: ఎస్ఎల్‌బీసీ సమావేశంలో చంద్రబాబు

రాష్ట్రంలోని అన్ని రంగాలను, వర్గాలను బలోపేతం చేసేలా రుణాలను అందించాలని, లక్ష్యాలను చేరుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. అమరావతిలో బుధవారం జరిగిన 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన పాల్గొని, వివిధ అంశాలపై అధికారులకు, బ్యాంకర్లకు కీలక దిశానిర్దేశం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేనప్పుడు ఇలాంటి సమావేశాలు నిర్వహించి ప్రయోజనం ఏముంటుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. “సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) రుణాల మొత్తం గతంతో పోలిస్తే పెరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో మంజూరు జరగలేదు. కొన్ని బ్యాంకులు ఇంకా వెనుకబడే ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి” అని అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యం ఉందని, ఇందుకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు అందించి సహకరించాలని కోరారు. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. “రుణాలు తీసుకున్న వారిలో 99 శాతానికి పైగా మహిళలు సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారు. ఈ విషయంలో ఏపీ ఎస్‌హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్–1 స్థానంలో నిలిచారు. కేవలం 0.67 శాతం మంది మాత్రమే చెల్లింపుల్లో విఫలమవుతున్నారు. వీరి నుంచి బకాయిలు వసూలు చేసేందుకు ‘వన్ టైమ్ సెటిల్‌మెంట్’ (ఓటీఎస్) విధానంపై ఆలోచించాలని బ్యాంకులకు సూచిస్తున్నాను” అని వివరించారు. రాష్ట్రంలో 15 శాతం ఆర్థిక వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ఎల్‌నినో కారణంగా కొంత ఇబ్బందికర పరిస్థితి తలెత్తిందని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రతికూలతలను అధిగమించి ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాష్ట్ర వ్యవసాయ రంగంలో కీలకమైన కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేందుకు బ్యాంకులు చొరవ చూపాలని ఆయన కోరారు.

## బీసీ రిజర్వేషన్లపై తీర్పు రిజర్వ్ చేసిన ఏపీ హైకోర్టు.. తీర్పుపై సర్వత్రా ఆసక్తి!

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలపై దాఖలైన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు విచారణను ముగించింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ వ్యవహారంపై తన తీర్పును రిజర్వ్ చేసింది. ప్రభుత్వ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం ప్రకటిస్తామని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఇటీవల 1065, 105 జీవోలను జారీ చేసింది. అయితే, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల మొత్తం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా నిర్దేశించిన 50 శాతం పరిమితిని దాటుతున్నాయని, ఈ జీవోలను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా జీవోలను సవరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా ప్రభుత్వ తీరుపై ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని కమిషన్‌ను ఏర్పాటు చేయడానికి గల ప్రధాన ఉద్దేశం ఏమిటని ప్రశ్నించింది. ఆ కమిషన్ నియామక ఉత్తర్వులను కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 34 శాతం రిజర్వేషన్లను సిఫారసు చేయడానికి కమిషన్ ఎలాంటి అధ్యయనం చేసింది? అందుకు ఆధారంగా తీసుకున్న గణాంకాలు, ప్రాతిపదిక ఏమిటి? అనే వివరాలను సమగ్రంగా తెలియజేయాలని ధర్మాసనం ప్రభుత్వాన్ని కోరింది. కమిషన్ సమర్పించిన పూర్తి నివేదికను తామే స్వయంగా పరిశీలిస్తామని స్పష్టం చేసింది. గతంలో రాష్ట్ర ప్రణాళికా విభాగం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను కూడా కోర్టు ముందు ఉంచాలని, ఆ సర్వే ఉద్దేశంపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. ప్రభుత్వం సమర్పించే అన్ని నివేదికలు, గణాంకాలు, ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే స్థానిక సంస్థల్లో బీసీలకు 34% రిజర్వేషన్ల అంశంపై తుది నిర్ణయం వెలువరిస్తామని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ క్రమంలో తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు తీర్పును రిజర్వ్‌లో ఉంచుతున్నట్లు ప్రకటించింది. హైకోర్టు తీర్పుతోనే స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల భవిష్యత్తు తేలనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు.. ఈ ఆదేశాలు ఎవరిచ్చారు

ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. “చంద్రబాబు గారి రెడ్ బుక్ పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. “చంద్రబాబు గారూ, ఇది పోలీసింగా? లేక రాజకీయ వేధింపుల కోసం చేస్తున్న ప్రభుత్వ ప్రాయోజిత మోసమా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను తొలగించేందుకు ఏపీ పోలీసులే తమ అధికారిక ఈమెయిల్ నుంచి ‘ఎక్స్’కు అభ్యర్థన పంపారని, కానీ అభ్యర్థన పంపిన సంస్థ పేరుగా ‘ఎఫ్‌బీఐ’ని పేర్కొన్నారని ‘ఎక్స్’ సంస్థే ధ్రువీకరించింది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? ఎఫ్‌బీఐ పేరును ఎందుకు దుర్వినియోగం చేశారు?” అంటూ జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల వైఫల్యం, డీఎస్సీ స్కామ్, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికే ఈ కుట్ర చేశారా? అని ఆయన నిలదీశారు. పోలీసు యూనిఫాం చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించిందని, రాజకీయ సెన్సార్‌షిప్ కోసం కాదని హితవు పలికారు. ఈ చర్య ద్వారా విదేశీ దర్యాప్తు సంస్థ పేరును రాజకీయాల్లోకి లాగి ఆంధ్రప్రదేశ్ పరువును తీశారని, పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శకుల గొంతు నొక్కేందుకు వెచ్చిస్తున్న శక్తిని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలుపై పెట్టాలని జగన్ సూచించారు. కరవుతో ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలవడం, ఉద్యోగాలు సృష్టించడం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టడం వంటి పనులు చేయాలన్నారు. ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే, విమర్శలకు సెన్సార్‌షిప్‌తో కాకుండా పనితీరు, పారదర్శకతతో సమాధానం చెప్పాలని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికల కోసం చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు: శ్రీకాంత్ రెడ్డి

అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం, జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు ఇప్పుడు ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలను విస్మరించి మహిళలు, రైతులు, యువత సహా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారని ఆయన మండిపడ్డారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మళ్లీ అవే హామీలను వల్లె వేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బలహీన వర్గాలకు, మహిళలకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయలేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు మంజూరు చేసిన తేదీ నుంచి కాకుండా, బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు తమ పింఛన్ల దరఖాస్తుల ఆమోదం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జగన్ హయాంలో వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్లు అందేవని, చంద్రబాబు ఆ సమర్థవంతమైన వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఏదో ఒక సాకు చూపి లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తున్నారని, జగన్ హయాంలో దాదాపు 69 లక్షల మందికి పింఛన్లు అందగా, చంద్రబాబు ప్రభుత్వం సుమారు ఆరు లక్షల మందిని తొలగించిందని ఆరోపించారు. ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి లేమిని స్పష్టం చేస్తోందన్నారు.

## ఈ వాస్తవాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారు: దాసరి శ్యామ్ చంద్రశేషు

**డీఎస్సీపై ఆరోపణలు... డైవర్షన్ కోసమే**

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే చంద్రబాబు తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపై చేశారని, మంత్రి నారా లోకేశ్ పర్యవేక్షణలో 16,000కు పైగా ఉపాధ్యాయ పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేశామని శ్యామ్ చంద్రశేషు స్పష్టం చేశారు. ఈ నియామక ప్రక్రియను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు 323 కేసులు వేసినా, ఏ ఒక్క కోర్టు కూడా ప్రభుత్వంలో లోపాలున్నాయని చెప్పలేదని, కనీస ఆధారాలు లేవని అన్ని పిటిషన్లను కొట్టివేసిందని గుర్తుచేశారు. “బహిరంగ చర్చకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరితే తోక ముడిచి పారిపోయిన జగన్, ఇప్పుడు మీడియా ముందు గంటల తరబడి అబద్ధాలు ప్రచారం చేయడం సిగ్గుచేటు. మీ దగ్గర ఆధారాలుంటే కోర్టుకు సమర్పించాలి కానీ, ఇలా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవడం మానుకోవాలి” అని హెచ్చరించారు.

**ఏపీపీఎస్సీ పాపాలు కప్పిపుచ్చుకునేందుకే డ్రామాలు**

జగన్ హయాంలో ఏపీపీఎస్సీలో జరిగిన చారిత్రాత్మక కుంభకోణంపై సిట్ దర్యాప్తులో ఒళ్లు గగుర్పొడిచే నిజాలు బయటపడ్డాయని శ్యామ్ చంద్రశేషు ఆరోపించారు. “సిట్ నివేదిక ప్రకారం, 736 మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌లకు పంపగా, ఏకంగా 718 షీట్లలో (97.55%) మార్పులు జరిగినట్లు తేలింది. ఉద్యోగాలకు ఎంపికైన 165 మందిలో 160 మంది ఓఎంఆర్ షీట్లను మార్చి ఉద్యోగాలు కట్టబెట్టారు. 98 శాతం అవకతవకలు జరిగిన మీ హయాంలోని ఏపీపీఎస్సీ స్కాంపై సీబీఐ విచారణ కోరే దమ్ము జగన్‌కు ఉందా?” అని ఆయన సవాల్ విసిరారు. తమ పాపాలు బయటపడి ఉన్న 11 సీట్లు కూడా ఊడిపోతాయనే భయంతోనే జగన్ డీఎస్సీపై బురద జల్లుతున్నారని విమర్శించారు. క్రెడిట్ దొంగ జగన్.. కాకి నెమలి కాలేదు “దొంగే ‘దొంగ దొంగ’ అని అరిచినట్టుగా జగన్ తీరు ఉంది. 16 నెలలు జైలు జీవితం గడిపిన ఆర్థిక ఉగ్రవాది, ఇతరులను నిందించడం హాస్యాస్పదం” అని శ్యామ్ చంద్రశేషు ఎద్దేవా చేశారు.

## రైతు బజార్లు, రేషన్ డిపోల ద్వారా 60 రకాల సరుకుల పంపిణీ.. సీఎం చంద్రబాబు కీలక సూచన

మార్కెట్ జోక్యంతో ధరల కట్టడి ధరల నియంత్రణకు మార్కెట్ ఇంటర్వెన్షన్ (ప్రభుత్వ జోక్యం) చాలా అవసరమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఏయే పంటలకు, ఏయే ప్రాంతాల్లో మార్కెట్ జోక్యం అవసరమో గుర్తించి, ధరలు పెరగకుండా చూడాలన్నారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలను రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయడంతో పాటు, ఆయా పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. అవసరమైతే రైతుల నుంచి నేరుగా పంటను కొనుగోలు చేసేందుకు బై-బ్యాక్ ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. “ముందుగా అంచనా (ప్రెడిక్షన్) వేశాకే ఉత్పత్తికి (ప్రొడక్షన్) వెళ్లాలి. ఆ మేరకు మార్కెట్‌ను కూడా అంచనా వేసుకోవాలి” అని సీఎం స్పష్టం చేశారు. ఆయిల్‌ఫెడ్, మార్క్‌ఫెడ్, రైతు బజార్లు, రేషన్ డిపోల వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ధరలను అదుపులో ఉంచాలన్నారు.

**రైతు బజార్లు, రేషన్ల ద్వారా పంపిణీ**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు బజార్లు, రేషన్ డిపోల ద్వారా దాదాపు 60 రకాల నిత్యావసర సరుకులను ప్రజలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. తక్షణమే ఉల్లి, కందిపప్పు వంటివి అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పామాయిల్‌ను కూడా రేషన్ డిపోల ద్వారా సరఫరా చేసే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. పశుగ్రాసం కొరత వల్ల పాల ఉత్పత్తి తగ్గిందనే మాట ఎక్కడా వినిపించకూడదని, పశుదాణాకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

**ప్రణాళికాబద్ధమైన పంటల సాగు**

రాష్ట్రంలో సాగు చేయకుండా ఉన్న 8.61 లక్షల హెక్టార్ల భూమిలో వర్షాధార పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా చిరుధాన్యాలైన రాగి, కొర్రలు, జొన్న, సజ్జలతో పాటు మొక్కజొన్న, ఉలవల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని (నేచురల్ ఫార్మింగ్) ప్రోత్సహించాలని సూచించారు. సంప్రదాయ ప్రాంతాల్లోనే కాకుండా, కొత్త ప్రాంతాల్లో కూడా ఉల్లి, మిర్చి వంటి పంటలు పండించేలా చూడాలన్నారు. రైతు సేవా కేంద్రాల వారీగా పంటల వివరాలు సేకరించి, డిమాండ్‌కు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించాలన్నారు.

# సంపాదకీయం

## జనగణనకు ముందు కులాల స్థిరీకరణ జరగాలి!



కులాలవారీగా జనగణన జరగడానికి ముందు ప్రామాణికంగా కులాల స్థిరీకరణ జరగడం అవసరం. లేదంటే పాలనా పరంగానే కాకుండా సామాజికంగా కూడా తీవ్రనష్టం జరిగే ప్రమాదం ఉంది. దేశంలోనే కాకుండా రాష్ట్రాలలో కూడా ప్రాంతాలను బట్టి ఒకే కులాన్ని పలు రకాల పేర్లతో పిలుస్తారు. ఇదే సమయంలో బీసీ రిజర్వేషన్లను ఏకరూపంలో కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేరువేరుగా అమలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వ ఓబీసీ జాబితాలో 107 కులాలు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ జాబితాలో 138 కులాలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల సంగతి ఎలావున్నా, మన రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ జాబితాకు, రాష్ట్ర ప్రభుత్వ జాబితాకు వ్యత్యాసం ఉంది. మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే ఒక కులం కొన్ని రాష్ట్రాలలో బీసీ జాబితాలో ఉంటే, మరో రాష్ట్రంలో ఎస్సీ జాబితాలో ఉంది. ఉదాహరణకు రజకులు ఆంధ్రప్రదేశ్‌లో బీసీ జాబితాలో ఉండగా, ఇతర రాష్ట్రాలలో ఎస్సీ జాబితాలో ఉన్నారు. అంతేకాకుండా ఒక రాష్ట్రంలో ఒక కులం ఓసీ జాబితాలో ఉంటే, అదే కులం మరో రాష్ట్రంలో బీసీ జాబితాలో ఉంది. ఉదాహరణకు కమ్మ కులం ఆంధ్రప్రదేశ్‌లో ఓసీ జాబితాలో ఉంటే, కర్ణాటకలో బీసీ జాబితాలో ఉంది. అలాగే కర్ణాటక రాష్ట్రంలో గౌడ కులం ఓసీ జాబితాలో ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో బీసీ జాబితాలో ఉంది. షెడ్యూల్ ప్రకారం 2026లో గృహాల సర్వే పూర్తి కాగా, కులాల వివరాలతో కూడిన జనగణన 2027 ఫిబ్రవరి నుంచి ప్రారంభం కానున్నది. జనగణన సర్వే నిర్వహించే సిబ్బంది ఎటువంటి ప్రశ్నలతో వివరాలు సేకరిస్తారనే విషయమై ఇంకా స్పష్టత రాలేదు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం ప్రజల నుంచి 40 ప్రశ్నలతో సమాచారం సేకరిస్తారని తెలిసింది. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జనాభా వివరాల సేకరణకు ముందే రాష్ట్రాల వారీగా ప్రామాణికమైన కులాల జాబితాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసింది. జనాభా వివరాల సేకరణ పత్రంలో ఆ కులాల జాబితా ఉండాలని, అప్పుడు ప్రజలు ఆ జాబితాలో తమ కులం ఏమిటో చెబుతారని వారు ఆ తీర్మానంలో వివరించారు. ఈ విధానం వల్ల ప్రజలు ఎవరికి వారు తమకు తోచిన కులం పేరు చెప్పకుండా నిర్దిష్టంగా తమ కులాన్ని తెలియజేసే అవకాశం ఉంటుందని ప్రస్తావించారు. వాస్తవంలో కూడా వ్యవహారికంగా మనకు నిత్యం కుమ్మరి, కమ్మరి, విశ్వబ్రాహ్మణ, రజక, నాయీ బ్రాహ్మణ, గౌడ, యాదవ, పద్మశాలి, పల్లెకారులు వంటి పది పదిహేను చేతివృత్తి కులాలు కనిపించినా, జాబితాలో మాత్రం చాలా కులాలు కనిపిస్తాయి. ఉదాహరణకు మన రాష్ట్రంలోనే బీసీ కులాల జాబితాలో 138 కులాలు ఉండగా, తెలంగాణలో 112 కులాలు ఉన్నాయి. ప్రస్తుతం నిర్వహించనున్న కులాలవారీ జనగణన సందర్భంగా బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో ఎటువంటి విధానాలు అవలంబించారో అధ్యయనం చేయడం అవసరం. 1931లో బ్రిటిష్ వారు చివరిసారిగా పూర్తిస్థాయిలో కులాల వారీగా జనగణన చేశారు. ఆ తర్వాత మరో నాలుగు పర్యాయాలు ప్రయత్నాలు జరిగినా సాంకేతికంగా ఆచరణకు నోచుకోలేదు. 1941లో కూడా కులాల వారీగా జనగణన నిర్వహించినా, రెండో ప్రపంచ యుద్ధం కారణంగా ఏర్పడిన పాలనాపరమైన ఇబ్బందుల వల్ల వెలుగులోకి రాలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1951 నుంచి 2001 మధ్య జరిగిన జనగణనల్లో కేవలం ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన వివరాలు మాత్రమే సేకరించారు. అయితే 2011లో కేంద్ర ప్రభుత్వం 'సోషియో ఎకనామిక్ అండ్ క్యాస్ట్ సెన్సెస్' పేరిట కులాల వారీగా జనాభా వివరాలను సేకరించింది. అయితే ఈ వివరాల సేకరణలో లోపాలు జరిగాయనే కారణంగా వాటిని బహిర్గతం చేయలేదు. 1931 సర్వేలో ఆనాడు భారతదేశంలో 4,147 కులాలు ఉన్నట్టుగా ప్రకటించారు. అయితే ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఓబీసీ కులాల వర్గీకరణ నిమిత్తం కేంద్రం నియమించిన జస్టిస్ రోహిణి కమిషన్ ఆరు సంవత్సరాలపాటు అధ్యయనం చేసి దేశవ్యాప్తంగా 2,600 ఓబీసీ కులాలు ఉన్నట్టుగా పేర్కొంది. అయితే సంఖ్యాపరంగా వ్యత్యాసం ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రభుత్వ దృష్టిలోకి రాని సంచార కులాలు ఇంకా ఉన్నాయా? లేక కొన్ని కులాలు అంతరించిపోయాయా? అనేది తెలుసుకోవాల్సి ఉంది. వచ్చే ఏడాది నుంచి జరగబోయే జనగణన ద్వారా ఇటువంటి అనేక విషయాలు అవగతమయ్యే అవకాశం ఉంటుంది. కులాల వారీగా జరిగే సర్వే భారతదేశ అభివృద్ధిలో ఎంతో కీలకం కానున్నది. అభివృద్ధి విషయంలో కులాల మధ్య ఎటువంటి వివక్ష ఉంది? విద్య, ఆర్థిక అంశాలలో ఎవరు వెనుకబడి ఉన్నారు? వంటి సమాచారాన్ని బట్టి ఏయే వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలి, ఏ తరహా అభివృద్ధి పనులు చేపట్టాలనే అవగాహన ఏర్పడుతుంది. అందువల్ల కులగణన ఏదో మొక్కుబడిగా కాకుండా శాస్త్రీయంగా, నిర్దిష్టంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది.

# జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ఖచ్చితంగా అమలు చేయాలి

**-కేంద్ర ప్రభుత్వ పథకాల పూర్తి స్థాయి అమలకు నిధులను సద్వినియోగం చేసుకోవాలి.**

**- నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి**

నంద్యాల సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం

జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ100 శాతం నిధులను వినియోగించుకోవాలని, కేంద్ర ప్రభుత్వ పథకాల కింద చేపడుతున్న పనులు నాణ్యతతో చేపట్టాలని, ప్రతిపాదనలు సకాలంలో సిద్ధం చేసి నిధుల వినియోగాన్ని వేగవంతం చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టి, వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు సకాలంలో అందేలా చూడాలనీ, పథకాల అమలకు నిధులను సద్వినియోగం చేసుకోవాలనీ నంద్యాల పార్లమెంటు సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నంద్యాల జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హాల్ లో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ (దిశ) సమావేశంలో నంద్యాల పార్లమెంటు సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ బైరెడ్డి శబరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ఆళ్లగడ్డ శాసనసభ్యులు భూమా అఖిల ప్రియ, జిల్లా పరిషత్ సీఈఓ ఆర్.సుధాకర్ రెడ్డి, డిప్యూటీ సిఈవో సుబ్బారెడ్డి, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల జిల్లా పరిధిలో వివిధ శాఖల వారిగా అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు సాధించిన పురోగతి ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా చర్చించారు. విద్య, వైద్య రహదారులు, నీటి వనరులు, పశుసంవర్ధక శాఖ తదితర కీలక శాఖలు అమలు అవుతున్న కార్యక్రమాలను శాఖల వారిగా సమీక్షించారు. నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టి, వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు సకాలంలో అందేలా చూడాలనీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో మరింత సమర్థవంతంగా అమలు చేయడం, శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. ఇప్పటివరకు సాధించిన పురోగతి, నిర్దేశిత లక్ష్యాలు, ఇంకా పూర్తి కావాల్సిన పనులు, ఎదురవుతున్న సమస్యలు, పనుల జాప్యానికి గల కారణాలను చర్చించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలు పురోగతిని




దిశా మీటింగ్ లో మాట్లాడుతున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



మాట్లాడుతున్న నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

ఎప్పటికప్పుడు అంచనా వేసి, అవసరమైన సరిదిద్దే చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధి పనులు త్రైమాసిక సమీక్షల ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. పరస్పర సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి వీలవుతుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో నిరంతర పర్యవేక్షణ, సమర్థవంతమైన నిధుల వినియోగం, అభివృద్ధి పనుల పురోగతి, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో జిల్లాలో సమగ్ర అభివృద్ధికి మరింత వేగం చేకూరేలా భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు. జిల్లాను అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ వ్యవసాయం, ఉద్యానవన, పశుసంవర్ధక, భూ రికార్డులు, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్యం, సమగ్ర శిక్ష, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యు ఎస్, , ఆర్ అండ్ బి, విద్యుత్, పౌర సరఫరాలు, స్కిల్ డెవలప్‌మెంట్, పరిశ్రమలు, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మున్సిపల్ తదితర 70కి పైగా శాఖలు, అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు మంజూరు అయ్యే నిధులను నిర్ణీత గడువులోగ చేసుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద మొదటి త్రైమాసికంలో కేటాయించిన నిధుల్లో 82 శాతం వినియోగించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన నిధులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు చేపట్టాలని సమగ్ర శిక్ష, గిరిజన సంక్షేమం తదితర శాఖలు వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పి ఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు తదితర మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని అన్నారు. PM-JANMAN కింద చేపడుతున్న రహదారులు, హాస్టళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, తదుపరి త్రైమాసిక సమీక్ష నాటికి నిర్దేశిత లక్ష్యాల మేరకు 100 శాతం పురోగతి సాధించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా నిరంతరం పర్యవేక్షించాలని, నిధుల వినియోగం, పనుల నాణ్యత, లక్ష్య సాధనలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు సంబంధించి నిధులు విడుదలకు అవసర మైన ప్రతిపాదనలను వివిధ శాఖల అధికారులు సకాలంలో సిద్ధం చేయాలన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) నిధుల ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదన కూడా వీలైనంత త్వరగా అందజేయాలని తెలిపారు. నందికొట్కూరు మెడికల్ అండ్ హెల్త్ శాఖకు సంబంధించి ఇచ్చిన ఆరోపణపై సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనాథ శరణాలయాలు అంగన్వాడి కేంద్రాల పనితీరు మౌలిక వసతులు అందుతున్న సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. గడివేముల నుంచి నందికొట్కూరు వెళ్లే మార్గంలో కె.సి కెనాల్ రోడ్డు మరమ్మత్తు పనులను త్వరగా తమ పూర్తి చేసి ప్రజలకు రహదారి అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలన్నారు. ఆళ్లగడ్డ శాసనసభ్యురాలు భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అమలు చేసి కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతికి నిధుల సద్వినియోగం గురించి సంబంధిత శాఖల అధికారులతో క్షుణ్ణంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వాలు పథకాలు నిధులు సద్వినియోగం ఆళ్లగడ్డ నియోజకవర్గం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలకు పూర్తిస్థాయిలో నిధులను వినియోగించి నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ABIP, NAIP కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు.

# వైఎస్సార్ నగర్‌లో నూతన ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం





**-నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి**

నంద్యాల సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం

పట్టణంలో ని 38వ వార్డు పరిధిలోని వైఎస్సార్ నగర్ లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నంద్యాల ఎంపీ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్ లు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఎంపీ నిధుల నుంచి ఈ వాటర్ ప్లాంట్ ను శాక్షన్ చేపించడం జరిగిందని, వైఎస్సార్ నగర్ ప్రజల దీర్ఘకాలిక తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేశామని తెలిపారు. వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు వైయస్సార్ నగర్ సమస్యల పట్ల త్వరితగతిన స్పందించడం ఎంతో అభినందనీయమని అన్నారు . ప్రజల సంక్షేమం, వార్డుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ప్రజల కనీస అవసరాలు గుర్తించి వాటిని పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని అన్నారు. వార్డు ప్రజల సంక్షేమం కోసం, వారి తాగునీటి కష్టాలను తీర్చాలనే సంకల్పంతో వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సహకారం తీసుకుని ఈ ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం అన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి చొరవతో వైఎస్సార్ నగర్ ప్రజలకు స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందుబాటులోకి రావడం సంతోషకరం అని ?వార్డులో ఎలాంటి సమస్య లున్నా ఎల్లప్పుడూ ముందుండి పరిష్కరించే సమర్థవంతమైన నాయకత్వం తాటికొండ బుగ్గరా ముడిదని. భవిష్యత్తులో కూడా వైఎస్సార్ నగర్ మరియు 38వ వార్డు పరిధిలో మౌలిక వసతుల కల్పనకు, కాలనీల సమగ్ర అభివృద్ధికి నాయకులందరం కలిసికట్టుగా అండగా ఉంటారని. ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి తెలిపారు .ఈ కార్యక్రమంలో మహేష్ బాబు, రసూల్ బాషా, మరాఠీ సూరి, బాబురావు, ప్రసాద్ రెడ్డి, సౌభాగ్యవతి, పద్మావతి, మేషక్, షబ్బీర్, గౌండ ఖలీల్, చందు, సలీం, పరమేష్, కార్తీక్, బబ్లు, గోవింద నాయుడు , జనసేన సురేష్, వార్డు నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# ముఖ్యమంత్రి మాటలు వెనక్కి తీసుకోవాలి: సిపిఎం డిమాండ్

**-పెన్షన్ దారులను అవమానించడం సరైనది కాదు సిపిఎం ఆగ్రహం**

నంద్యాల సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం

పెన్షన్ల ను తీసుకోని తాగుతున్నారు అంటూ కలెక్టర్లతో జరిగిన మీటింగ్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడిన మాటలు సరైంది కాదు అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, మండల కార్యదర్శి వెన్న బాల వెంకట్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ప్రభుత్వము అధికారంలోకి రాకముందుకు సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్గా అమలు చేసి చూపించామని ప్రగల్బాలు పలుకుతున్నారని ముఖ్యంగా గత రెండున్నర సంవత్సరాల కాలంలో పెన్షన్ దారులు లక్షలాదిమంది ఎప్పుడు ఎప్పుడు అవకాశం వస్తుందా అని చూస్తే కేవలం పది రోజులు మాత్రమే అవకాశం ఇచ్చి అప్లై చేసుకోండని చెప్పడం చాలా దుర్మార్గమని గత రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలు లేకపోవడం వలన ఇప్పుడు మున్సిపాలిటీ పంచాయతీ ఎలక్షన్లు దగ్గర పడుతుండడంతో ప్రజలకు ఏదో ఒకటి చేసి మళ్లీ మభ్య పెట్టేందుకు పెన్షన్ పథకాన్ని అప్లై చేసుకోండి అని పది రోజులు మాత్రమే సమయం ఇవ్వడం సరైనది కాదని సిపిఎం పార్టీగా ఈ నెల చివరి వరకు అర్హులైన పెన్షన్ దారులందరూ అప్లై చేసుకునే విధంగా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందుకు గత వైసిపి ప్రభుత్వ హాయంలో అమ్మబడి పథకం ఇస్తూ నాన్న బుడ్డిని కొనుక్కునేందుకు




ప్రోత్సహిస్తుందని ఎద్దేవా చేశారని నేడు అదే విధంగా పెన్షన్ పథకాన్ని ప్రజలం దరికీ పెద్ద ఎత్తున మేము ఇస్తున్నామని ప్రతినెల పండగలాగా జరుపుకోవాలని వందల కోట్లు దుర్విని యోగము చేయడం జరుగుతుందని, ఇప్పుడు మళ్లీ మరికొంతమందికి ఇవ్వవలసి వస్తుంది అని అక్కర్సో ప్రజల పైన లేనిపోని అబండాలను వేయడం సరైనది కాదని ప్రజలకు ఏ విధంగా సంక్షేమ పథకాన్ని దూరం చేయాలి అనే దూర్బుదితో ముఖ్యమంత్రి మాటలు ఉన్నాయని గతం నుండి చూస్తే ముఖ్య మంత్రిగా చంద్రబాబు నాయుడు పేరు చెబితే ప్రజా సంక్షేమం కోసం ఏ ఒక్క పథకము గుర్తు రాదని, ప్రజలకు సంక్షేమం కోసము ఏమాత్రం టిడిపి ప్రభు త్వం పనిచేయదని మళ్లీ రుజువైందని కేవలం పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు మాత్రమే ఊడిగం చేసే విధంగా కూటమి ప్రభుత్వం పాలన ఉందని అన్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకుపోతున్నామని మహానాడులో వేదిక పైన చెప్పడం పరిపాటు గా మారిందని మహానాడులో చెప్పిన విధంగా ముఖ్యమంత్రిగా ఎన్నికైన ఎన్టీఆర్ మహిళల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మద్య పానాన్ని పూర్తిగా నిషేధించాలని కానీ కుటుంబం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన మద్యం పాలసీని ఏర్పాటు చేస్తామని చెప్పి పట్టణాలకే కాకుండా గ్రామాలకు విస్తరించేలా పాలసీని మొదలుపెట్టి వీధికి ఒక బెల్ట్ షాపును పెట్టుకునేలా రాష్ట్రంలో పాలన ఉందని మహిళలు కూటమి ప్రభుత్వాన్ని చీదరించుకుంటున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టిన ముఖ్యంగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల స్టంట్ కోసమే పథకాలను ప్రవేశపెడతారని మరోసారి రుజువైందని ప్రజలు గమనిస్తున్నారని రాబోయే కాలంలో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు.

# లెప్రసీ సర్వే ఆన్లైన్ వర్క్ ఆశాలకు మినహాయింపు ఇవ్వాలి

**-ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నంద్యాల జిల్లా కమిటీ సిఐటియు**

నంద్యాల సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం

లెప్రసి సర్వే, ఆన్లైన్ వర్క్ ఆశాలకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ బుధవారం నంద్యాల ఇన్చార్జి డి ఎం హెచ్ ఓ .డాక్టర్ శారదా భాయ్ కు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి రమణకుమారి జిల్లా అధ్యక్షురాలు జి నాగమణి సిఐటియు జిల్లా కార్యదర్శులు వెన్న బాల వెంకట్ నంద్యాల జిల్లా ఆశ యూనియన్ నాయ కురాలు కోశాధికారి కృపావతి, వెంకటేశ్వరమ్మ ,వెంగమ్మ, సువర్ణ వరలక్ష్మి, భాగ్యమ్మ, సుమలత, నజరునిసా, శివమ్మ, సుధా ,సీతమ్మ, శిరోమణి, చెన్నమ్మ లతో కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి రమణకుమారి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పరిధిలో 11/ 9/ 2026 నుండి 24/ 9/ 2026 వరకు జరిగే లెప్రసీ కేస్ డిటెన్షన్ క్యాంపియన్ సర్వేలో ప్రతి వ్యక్తికి క్రియేట్ చేసి ఓటిపి ద్వారా ధ్రువీకరణ చేసే విధానాన్ని ఈ సర్వేలో కొత్తగా



ప్రవేశపెట్టారు ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ నుండి ఎన్సీడీసీ సర్వే లాంటి వి మరియు సచివాలయ శాఖ నుండి అనేక సర్వేలను ఓటీపీ విధానాన్ని పదేపదే నిర్వహించడం వలన మరియు వీడియో ద్వారా ఓటిపి నుంచి జాగ్రత్తలు వింటున్న కారణంగాను ప్రజల నుండి ఓటిపి చెప్పటానికి వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుం దని అదేవిధంగా నెట్వర్క్ ఇబ్బందులు మొబైల్స్ మోరాయించడంతోను అదనపు సమయం ఆశాలపై మానసిక ఒత్తిడి పెరుగుతుందని ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉద్యోగులపై పనిభారం మానసిక ఒత్తిడి పెరగకుండా సర్వేను నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి ఐడి క్రియేషన్ ఓటిపి విధానం నుండి ఇవ్వాలని లేని పక్షంలో ఆన్లైన్ చేసే విధానానికైనా మార్పు చేయాలని వారు అన్నారు ఇప్పటికైనా ఆశాలపై పని భారం తగ్గించి వారికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా గణనాథుని శోభాయాత్ర





**-భాజా భజంత్రీల సందడిలో వీధి వీధినా గణనాథుని ఊరేగింపులు**

**-37 విగ్రహాల నిమజ్జనం ప్రశాంతం.. నేడు వెలుగోడులో 43 గణనాథుల నిమజ్జనానికి ఏర్పాట్లు**

వెలుగోడు సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం

వెలుగోడు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. బుధవారం పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల నిమజ్జన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. భాజా భజంత్రీలు, డప్పు వాయిద్యాల నడుమ గణనాథుని విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై ఊరేగిస్తూ నిమజ్జన ప్రాంతాలకు తరలించారు. వీధి వీధినా సాగిన శోభాయాత్రలతో గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన మొత్తం 37 గణనాథుల నిమజ్జన కార్యక్రమాలు పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శోభాయాత్రలు జరిగే మార్గాల్లో పోలీసు సిబ్బందిని మోహరించి ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, యువతకు పోలీసులు పలు సూచనలు చేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది సైతం అప్రమత్తంగా వ్యవహరించారు. శోభాయాత్రలు వెళ్లే మార్గాల్లో విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. నిమజ్జన కార్యక్రమాల సమయంలో విద్యుత్ ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ ఏఈ రవీంద్ర నాయక్ తెలిపారు. ప్రజలు విద్యుత్ తీగలు, స్తంభా లకు దూరంగా ఉండాలని, ఊరేగిం పుల సమయంలో అప్రమత్తంగా వ్యవహరి ంచాలని సూచించారు. నేడు వెలుగోడు పట్టణంలో గణనాథుల నిమజ్జన కార్యక్ర మానికి అధికారులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన 43 గణనాథుల విగ్రహాలను భక్తులు శోభాయాత్రగా తరలించి నిమజ్జనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ప్రధాన కూడళ్లు, శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ సురేష్ కోరారు. శోభాయాత్రలో పాల్గొనే యువత ఎలాంటి అవాం ఛనీయ చర్యలకు పాల్పడకుండా సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ప్రమాద కరంగా వాహనాలపై ప్రయాణించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. గణనా థుని నిమజ్జనం భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావ రణంలో నిర్వహిం చేందుకు అన్ని శాఖల సమన్వ యంతో ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. గణనాథుని శోభా యాత్ర సందర్భంగా గ్రామాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువత డప్పుల మోతకు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు సైతం శోభాయాత్రలను తిలకిస్తూ భక్తిభావంతో గణనా థునికి వీడ్కోలు పలికారు. నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# పోలింగ్ స్టేషన్లు , ఓటర్ల జాబితా పై నాయకుల సూచనలు

**-ఓటర్ల జాబితా పై నాయకులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీవో.**



వెలుగోడు సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం

వెలుగోడు మండలములో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నిర్వహణపై పార్టీ నాయకుల సూచనలను పరిగణలోకి తీసుకుంటామని ఇన్చార్జి ఎంపీడీవో గంధం మురారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనములో పార్టీ నాయకులతో బుధ వారము సమావేశం ఏర్పాటు చేశారు. మండల పరిధిలో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నిర్వహణ కొరకు ప్రతిపాదించిన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను సెప్టెంబర్ 15న ప్రచురించినట్లు ఎంపీడీవో చెప్పారు. ఈ పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా పై క్లైములు అభ్యంతరాలు మరియు సూచనలు రాజకీయ నాయకులు నుంచి స్వీకరించారు. వెలుగోడు మండలంలో మొత్తము ప్రతిపాదించిన పోలింగ్ కేంద్రాలు 46 ఉండగా, ఓటర్ల సంఖ్య 42, 759 మంది ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు మంజులారెడ్డి, టిడిపి నాయకులు ఖలీల్, సుధాకర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, వైయస్ఆర్సీపీ నాయకులు ఇలియాస్ ఖాన్, జైపాల్, రామ్మోహన్ రెడ్డి, బిజెపి నాయకులు రాజశేఖర్ రెడ్డి, జనసేన నాయకులు షాలుబాషా, కాంగ్రెస్ నాయకులు అక్బర్ షా, మైనార్టీ నాయకులు జాకీర్ హుస్సేన్, సిపిఎం నాయకులు మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

**-పూజలు అందుకుంటున్న గణనాథుడు.**

వెలుగోడు సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం



వెలుగోడు పట్టణంలో రిజర్వాయర్ వద్ద గల మద్రాస్ కాలువలో గురువారం జరిగే నిమజ్జన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. వెలుగోడు మండలంలో వినాయక చవితి పండగ నాడు ప్రతిష్టించిన 80 విగ్రహాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిం చారు. వెలుగోడు పట్టణంలో 43 వినాయక విగ్రహాలను ప్రతిష్టించగా, మండలంలోని మిగతా గ్రామాలలో 37 వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. గుంత కందాల, అబ్దుల్లాపురం, వేల్పనూరు, రేగడ గూడూరు , బోయరేవుల , మోత్కూరు గ్రామాలలో మూడు రోజులపాటు పూజలందుకున్న వినాయక విగ్రహాలను బుధవారము పోలీసుల బందోబస్తు మధ్య ప్రశాంతంగా సమీపములోని కాలువలలో యువకులు భక్తుల కోలహాలాల మధ్య నిమజ్జనం చేశారు. వెలుగోడు పట్టణంలోని ద్వారకా నగర్ లో వినాయక విగ్రహాశీ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముస్లిం నాయకుడు ఖాదర్ వలీ 35వేల రూపాయలు విరాళం ఇవ్వడం విశేషం. గాంధీ నగర్ వద్ద గల వినాయక విగ్రహం వద్ద రాఘవేంద్ర అనే భక్తుడు అన్నదానశీ ఏర్పాటు చేశారు. గుర్రంపేట లో గల వినాయక విగ్రహం వద్ద డాక్టర్ పద్మావతమ్మ అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. వినాయక విగ్రహాల వద్ద మండపాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. భక్తులు భజనలు , నృత్యాలతో యువకులు సందడి చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# కామన్వెల్త్ సదస్సులో ఎంపీ ప్రసంగం

బాపట్ల సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం



దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక 69వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ లో భాగంగా జరిగిన వర్క్‌షాప్‌లో లోక్‌సభ ప్యానెల్ స్పీకర్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు శ్రీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.“విభిన్న ఆర్థిక వ్యవస్థల్లో సమానత్వంతో కూడిన న్యాయమైన వాణిజ్యాన్ని ప్రోత్సహిం చడం,అసమానతలు--అల్పాభివృద్ధిని అధిగమిం చేందుకు అంతర్ పార్లమెంటరీ సంభాషణను బలోపేతం చేయడం” అనే అంశంపై నిర్వహించిన జూజ వర్క్‌షాప్--Aలో భారత పార్లమెంటరీ ప్రతినిధి బృందంతో కలిసి ఎంపీ కృష్ణ ప్రసాద్ చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామన్వెల్త్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాల విస్తరణ, ఆర్థిక సమతుల్యత సాధన, పేదరిక నిర్మూలనకు అవసరమైన చట్టపరమైన సంస్కరణలపై ఎంపీ కృష్ణ ప్రసాద్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రపంచ ఆర్థిక సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడంతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేసేందుకు పార్లమెంటరీ స్థాయిలో పరస్పర చర్చలు, సహకారం అవసరమని సమావేశంలో చర్చించారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ఉప్పలపాడుకు విద్యుత్ వెలుగులు

**-33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభం..**
**-లో-వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం: కన్నా**

సత్తెనపల్లి సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం

సత్తెనపల్లి: రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా గ్రామస్థులు ఎదురుచూస్తున్న విద్యుత్ ఉపకేంద్రం అందుబాటులోకి రావడంతో ఉప్పలపాడుతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు లో-వోల్టేజ్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉప్పలపాడు గ్రామానికి ఈ రోజు శుభదినమన్నారు. సబ్‌స్టేషన్ కోసం గ్రామస్థులు గతంలో తనను పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేశారని గుర్తుచేశారు. గ్రామంలో నెలకొన్న లో-వోల్టేజ్ సమస్య కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, విద్యుత్ మోటార్లు కాలిపోవడం, రాత్రి వేళల్లో సరఫరా సమస్యలు వంటి ఇబ్బందులు ఉండేవని చెప్పారు.కొత్తగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌తో ఉప్పలపాడు, పరిసర గ్రామాల్లో లో-వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించడంతోపాటు గృహాలకు మెరుగైన విద్యుత్ సరఫరా, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ అందుబాటులో ఉంటుందని వివరించారు.

**-అభివృద్ధికి పునాది**

ఈ సబ్‌స్టేషన్ కేవలం విద్యుత్ ఉపకేంద్రం మాత్రమే కాదని, ఉప్పలపాడు గ్రామ అభివృద్ధికి ఇది ఒక పునాది అని కన్నా పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా మెరుగుపడటంతో వ్యవసాయ రంగంతోపాటు గృహ, వాణిజ్య అవసరాలకు కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని విద్యుత్ వెలుగుల రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని పనులు పూర్తి చేస్తామని తెలిపారు. సబ్‌స్టేషన్‌ను త్వరితగతిన పూర్తి చేసిన విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, పనులకు సహకరించిన గ్రామ ప్రజలకు కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖకు చెందిన వివిధ స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

**-వినాయక మండపాల్లో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రత్యేక పూజలు**

గుంటూరు, సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం



వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు సందర్శించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.గుంటూరు తారకరామనగర్‌లోని ఎస్‌వీఎన్ కాలనీ, తురకపాలెంలోని మౌంట్‌వ్యూ అపార్ట్‌మెంట్స్, స్వర్ణభారతినగర్, శ్రీరామ వర్క్స్ అండ్ సప్లయర్స్, అడవితక్కెళ్లపాడులోని కేబీకే యూత్, నగరాలు పీఎస్‌కే యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఆయా మండపాల్లో విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితి మహోత్సవాల్లో పాల్గొని గణనాథుడిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజలంతా ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలను నిర్వహించడం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రత్తిపాడు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలకు ఎల్లప్పుడూ మంచి జరగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మండపాల నిర్వాహకులు, భక్తులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా మాట్లాడి ఉత్సవాల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. గణపతి ఉత్సవాలు భక్తి, ఐక్యతకు ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ జిల్లాలలో ఇంజనీర్స్ అవగాహన కార్యక్రమం







**-ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ఈడబ్ల్యూఐడిసి రాష్ట్ర డైరెక్టర్ జి.నాగముని**

నంద్యాల సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం

తిరుపతి పట్టణంలోని, పద్మావతి మహిళా యూనివర్సిటీలో బుధవారం జరిగిన ఏపీ ఈడబ్ల్యూఐడీసీ శాఖ రీజనల్ ఎస్ఇ ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాల ఇంజనీర్లకు అవగాహన సదస్సు & శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర డైరెక్టర్లు జీ.నాగముని, రమేష్ నాయుడు హాజరయ్యారు ఈ సందర్భంగా ఏపీ ఈడబ్ల్యూ ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ జీ.నాగముని మాట్లాడుతూ రాయలసీమ సర్కిల్లోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల ఇంజనీర్లు ఎటువంటి అవకతవగలకు పాల్పడకుండా, పనులు నాణ్యతగా, క్వాలిటీగా, క్యూరింగ్ గా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా నిర్మాణాలు కలకాలం ఉండేటట్టు నిర్మించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మా చైర్మన్, డైరెక్టర్లమైన మేము అన్ని పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. మనమందరం కలిసి అభివృద్ధి కోసం పాటుపడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈడబ్ల్యూఐడిసి శాఖ ఈఈ రవీంద్రబాబు, క్వాలిటీ కంట్రోల్ ఈ.శ్రీనివాసరెడ్డి, పద్మావతి మహిళా యూనివర్సిటీ రిజిస్టర్ ఉషా, కర్నూలు, నంద్యాల జిల్లాల ఏపీ ఈడబ్ల్యూఐడీసీ డిపార్ట్మెంట్ ఈఈ ఎం.లక్ష్మీ నారాయణ, డిఈఈ లు-జి.నాగరాజు, ఎం.బాల జోజప్ప, సూపరిండెంట్ చింతకాయల వెంగన్న, జూనియర్ అసిస్టెంట్ నాయకంటి చిన్న మద్దిలేటి, సైట్ ఇంజనీర్లు కే. వెంకటరామిరెడ్డి, పి.సురేష్ కుమార్, సి. మహేష్, కె.సురేంద్ర కుమార్, పి.రఘు మధు మోహన్, ఎస్ఎండి.ఆజాజ్ బాషా ఉమామ హేశ్వరరావు, ఆర్.దివ్య, కె.సిహెచ్. మునీశ్వర్, జి.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎం. లక్ష్మన్న హరీష్ ఎన్.దినేష్, ఆఫీస్ సబార్డినేట్ లు పి. హీరాలాల్, సి.బాలయ్య, తదితర జిల్లాల ఈఈలు, డిఈ లు, సైట్ ఇంజనీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మద్దూరు గ్రామంలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులకు ఘన సన్మానం





**-పాములపాడు ఎస్ఐ పి.తిరుపాలు, నీటి సంఘం చైర్మన్ జి.తిమ్మారెడ్డిలకు పూల మాలలు, శాలువాలతో ఘన సత్కారం**

పాములపాడు, సెప్టెంబర్,16 వార్త సాక్ష్యం

పాములపాడు మండల పరిధిలోని, మద్దూరు గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఈపూరి నరేంద్ర, గ్రామస్తుల ఆధ్వర్యంలో రాత్రి కోలాటాల భజనల మధ్య చాలా ఉత్సాహంగా గణపతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాములపాడు మండల ఎస్ఐ పి.తిరుపాలు, నీటి సంఘం చైర్మన్ రైతుల నాయకుడు మద్దూరు జి.తిమ్మారెడ్డి, టిడిపి మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి లు పాల్గొని, వేడుకలను చూసి తిలకించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించి, ముఖ్య అతిథులుగా హాజరైన టువంటి ఎస్ఐ పి.తిరుపాలు, జి తిమ్మారెడ్డి లకు తీర్థప్రసాదాలు అందించి శాలువలు, పూలమాలలు మెడలో వేసి, ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎస్ఐ పి.తిరుపాలు మాట్లాడుతూ గ్రామంలో శాంతియు తంగా, కులమతాలకు అతీతంగా ఎటువంటి భేదాబి ప్రాయం లేకుండా బాగా సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా ఈరోజు జరగబోయే నిమజ్జనం వేడుకల్లో కూడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామంలో ప్రశాంతంగా ఉత్సవం జరిపించాలని కమిటీ పెద్దల కు అలాగే గ్రామస్తులకు సూచించారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు జి.రవీంద్రారెడ్డి, నీటి సంఘం చైర్మన్ నియోజకవర్గం రైతు నాయకుడు జి.తిమ్మారెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రైతుల, కౌలు రైతుల పంట రుణాలపై అప్పులను వెంటనే రద్దు చేయాలి

**-ఈనెల 21న నంద్యాల జిల్లా కలెక్టర్ రేట్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయండి**
**-ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, పి.సుధాకర్ డిమాండ్**

ఆత్మకూరు సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం



జిల్లాలో ఎల్ నీనో తీవ్రత అధికంగా ఉన్నందున, ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలు రైతుల సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘాలు ఉమ్మడిగా కలిసి ఈనెల 21వ తేదీన నంద్యాల కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతులసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ శ్రీనివాసులు జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, ఆత్మకూరు మండలంలో బాపనంతపురం, ముష్టి పల్లె, సిద్దపల్లె, నల్ల కాలువ గ్రామాలలో రైతులను కౌలు రైతులను వ్యవసాయ కూలీలను కలిసి బుధవారం కర పత్రాలు విడుదల చేశారు ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ పకృతి వైపరీత్యాల వల్ల రోజురోజుకు ఎల్ని నో తీవ్ర రూపం దాల్చడంతో మే నెల చివర, జూన్ నెల ముందుగా వర్షాలు కురవడంతో రైతులు కౌలు రైతులు మొక్కజొన్న, మినుము, సోయాబీన్, కంది, పెసర, మిరప తదితర పంటలు వేసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. అధికారులు మాత్రం ముందుచూపు లేకుండా పంటలు వేసుకోండి అని చెప్పడంతో కౌలు రైతులు, రైతులు విత్తనాలు వేసుకోవడం జరిగిందని అన్నారు. కౌలు రైతుల కు బ్యాంకులలో పంట రుణాలు దొరకకపోవడంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గరఅధిక వడ్డీలకు అప్పులు చేసి దేవాలయ అధికారులకు, భూయజమానులకు ముందుగానే కౌలు చెల్లించి వ్యవసాయం చేశారన్నారు. ఎల్లినో ప్రభావంతో కౌలు రైతులు పూర్తిగా నష్టపోయా రన్నారు. ఈ జిల్లాలో నూటికి 80 శాతం మంది కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారన్నారు. అందుకని తక్షణమే కౌలు రైతులపై రైతులపై ఉన్న అన్ని రకాల అప్పలను రద్దు చేయాలని, దేవాదాయ శాఖ కు కౌలు చెల్లించిన సాగుదారులకు ఒక సంవత్సరం కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు రైతులపై ఆధారపడి జీవించేవారని,వారి కుటుంబా లుపనులు లేకపోవ డంతో అర్ధాకలితో అలమటి స్తున్నారని ఆయన అన్నారు. వెంటనే ఉపాధి పనులు కల్పించి, కరువు కూపన్లు ఒక బస్తా బియ్యం ఇచ్చి, 16 రకాల నిత్యావసర వస్తువులు సరఫరా చేసి పేదలందరినీ ఆదుకోవాలని ఆయన అన్నారు. ఈనెల 21వ తేదీన నంద్యాల కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు పేదలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ 9వ నంబర్ గేట్‌కు మరమ్మతులు పరిష్కారనికి కృషి

**-నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య**

జూపాడుబంగ్లా సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం







జూపాడుబంగ్లా మండల పరిధిలోనిపోతిరెడ్డిపాడు రెగ్యులేటర్‌లో ఇటీవల 11వ తేదీన 9వ నంబర్ గేట్‌కు సంబంధించిన రోప్ తెగిపోవడంతో గేటు నీటిలో పడిపోయిన ఘటనపై నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య స్పందించారు.ఈ విషయాన్ని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో దృష్టికి తీసుకెళ్లి, సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించిన మంత్రి, రూ.3 లక్షల వ్యయంతో మరమ్మతు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు.మరమ్మతు పనులు 3లక్షల రూపాయలతో పూర్తి చేసి, పురోగతిని పరిశీలించేందుకు బుధవారం పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్‌ను సందర్శించిన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అధికారులతో మాట్లాడి పనుల వివరాలను తెలుసుకున్నారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా రెగ్యులేటర్ గేట్ల నిర్వహణ, మరమ్మతు పనులను వేగవంతంగా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్శనలో జూపాడుబంగ్లా మండలా కూటమి నాయకులు ప్రభుత్వ అధికారులు నాయకులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# గోవింద రెడ్డిప్ప కొందరి వారే నా విజయవాడ -గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి

విజయవాడ సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం

నాయకులను కాదనీ తనకి భజన చేసే వారు నీ తన నీ పొగిడే వారిని భజన సంఘాల నాయకులను వెనక వేసుకును తానే అన్ని చేస్తున్నట్టు భావించే వారే గోవింద గోవిందా తాను ఎక్కడ వచ్చినా తనకి సకల సౌకర్యాలు రాచ మర్యాదలు కావాలి దొర కి నిరంతరం గ్రామీణ వైద్యుల సమస్య లు పరిష్కారం కోసం కృషి చేస్తున్న నాయకులు ను విజయవాడ ధర్నా చౌక్ లో మౌన దీక్ష చేసినప్పుడు డిల్లీ లో జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్ష చేసినప్పుడు ఈ గోవిందుడు ఎక్కడ వున్నారు కనీసం సంఘీభావం కూడా తెలపలేదు ఈ జాతీయ పెద్ద నాయకులు నాయకులు ఎక్కడ ఉన్నారో గతంలో ఉన్న ముఖ్య మంత్రి గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకు లను చూసి పేరు పెట్టి పిలిచే ప్రేమ అభిమానం ఉన్న నాయకులను కాదని వారి సలహాలు సంప్రదింపులు లేకుండా సభలు సమావేశాలు ఏర్పాటు చేయడం ఈ గోవిందుడు కే చెల్లింది ఎవరి సలహాలు అక్కర్లేదు ఎవరితో సంప్రదింపులు అవసరం లేదు ఎవరిని కలుపుకుని వెళ్లి ఉద్దేశం లేదు తనకి భజన చేసేవారు తనకు జేజేలు పలికేవారు తనకి పల్లకి ఏమోసేవారే తన మిత్రబృందం మిగతావారు నాయకులు కాదు సంఘాలు కాదు ఫెడరేషన్లు కాదు ఒక ఆంధ్రప్రదేశ్ లో ఉన్న సంఘాలనే ఐక్యత లేని సంఘాలను ఐక్యం చేయలేని ఈ జాతీయ నాయకులు రేపటి జాతీయ సమావేశంలో ఏం చేస్తారు గ్రామీణ వైద్యులకు ఏం న్యాయం చేస్తారు అనేది గ్రామీణ వైద్యులకు ఉన్న ఆవేదన నిత్యం ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు తో హెల్త్ సెక్రెటరీ తో నిరంతరం పోరాడుతున్న జాతీయ ఆర్ ఎం పీ పి ఎం పి సంఘాల సమైక్య నాయకులు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకులు గోవిందు కి కనపడరు విజయవాడ లో సమావేశం కి పిలుస్తారు అన్ని సంఘాలు కలయిక అంటారు ఒక్క విజయవాడ లో అన్ని సంఘాల నాయకులను కలుపుకుని వెళ్ల లేని గొప్ప గోవిందుడు జాతీయ స్థాయిలో సమావేశం పెట్టీ ఏమి సాధిస్తారు ఐకమత్యం అంటే కేవలం బ్యానర్ పై పేరు మాత్రమే నిజానికి అది జరగదు అందరిని కలుపుకుని ఐక్యం నడిపే సత్తా లేదు రాష్ట్రం లో కాదు కనీసం గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం పుట్టిన విజయవాడ గడ్డ లో నాయకుల ను కలప లేని నాయకుడు జాతీయ సమావేశం ఏర్పాటు చెయ్యటం ఉట్టి కి ఎగర లేని అమ్మ స్వర్గానికి ఎగురుత అన్నట్టు ఉంది జాయింట్ యాక్షన్ కమిటీ అంటే అర్థం ఏమిటి ఝుఏ అంటే ఎవరు ఈ పేరు పెట్ట వచ్చు రిజిస్టర్ కానీ జేఏసీ అని పెట్టు కొని ఎవరి కోసం ఆశయం మంచిది అయినా కార్య చరణ అమలు చేయడం లో విఫలం అయ్యారా అని చెప్ప వచ్చు గోవిందా ముందు ఇల్లు సరిదిద్ది కొని అప్పుడు జాతీయ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసిన బాగుంటుంది అని వాపోతున్నారు గోవిందా గ్రామీణ వైద్యుల సమస్య లు పూర్తిగా అవగాహన లేని వారు జాతీయ నాయకులు మా కర్మ వ్యవస్త కి పట్టిన దరిద్రం రాష్ట్రం లో జిల్లాలో సమావేశం పెట్టాలి అని భావిస్తే సోషల్ మీడియా లో చూడ వలసిందే ఇంకా జాతీయ స్థాయిలో సమావేశం కి ఎవరిని సంప్రది ంచటం వుండదు ఆయన కి భజన చేసే వారితో మాట్లాడుకుని జాతీయ స్థాయిలో సమావేశం సోషల్ మీడియాలో పోస్ట్ పెడతారు ఇది ఎక్కడ న్యాయం గోవిందా మీ వలన వ్యవస్థకి ఉపయోగం లేదు మీకు స్వంత లాభం ఏమి ఉంది అర్థం కావటం లేదు గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కొరకు తమ జీవితాన్ని త్యాగం చేసిన నాయకులను కలిసి ఏ



రోజైనా మాట్లాడిన సందర్భం ఉందా వారి ఆరోగ్య సమస్యలు తో ఇంటి వద్ద ఉన్నవారిని ఏ రోజైనా పలకరించిన పాపాన ఉన్నదా కరోనా కష్టకాలంలో ఎవరికైనా సహాయం చేసిన ఘనత ఉన్నదా గ్రామీణ వైద్యుల కోసం కష్టపడి పనిచేస్తున్న నాయకులను వారి స్నేహాన్ని వారిద్దరి మధ్యన గొడవలు పెట్టి విడదీసే ప్రయత్నం చేయడం లేదా గోవిందా మీరు ఇది ఎక్కడ న్యాయం గోవిందా మా అందరి అబి ప్రాయం చెయ్య గలిగితే అన్ని సంఘాలు కలుపుకుని ఐక్యం గా నడపాలి అని అందరి తరుపున కోరుచు న్నాము లేదా ఆ పదవి చెయ్య లేను అని తప్పు కోవాలి నీ స్వార్థ పరులు అయితే అని మా అభిప్రా యం నిరంతరం పోరాడుతున్న జాతీయ ఆర్ ఏం పీ పి ఎం పి సంఘాల సమైక్య అద్యక్షులు కొండి శెట్టి సురేష్ బాబు విజయవాడ కు చెందిన ఎదురులేని నాయకత్వంతో అన్ని సామాజిక వర్గాలను సమన్వ యంతో కలుపుకొని ముందుకు వెళుతూ ప్రజా సేవకునిగా ఎన్నో గుర్తింపులు తెచ్చుకున్న కొండిశెట్టి సురేష్ బాబు సేవలు విజయవాడ ప్రాంత ప్రజలకు ఆదర్శంగా నిలిచాయి.

# ఉద్యోగం కోరుకునే స్థాయి నుంచి ఉపాధి కల్పించే స్థాయికి యువత ఎదగాలి






-సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టితో రాష్ట్రానికి పెట్టుబడులు.

-నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

నంద్యాల సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం

నా స్వస్థలమైన నంద్యాలలో, భవిష్యత్ భారతాన్ని తీర్చిదిద్దే యువతీ యువకుల మధ్య ఈ సదస్సును ప్రారంభించడం నాకెంతో సంతోషాన్ని ఇస్తోందని, ఒక రాష్ట్రంలోనైనా, దేశంలోనైనా శాశ్వత మార్పు రావాలంటే అది యువశక్తితోనే సాధ్యమని, అందుకే మా మంచి కూటమి ప్రభుత్వం యువత నైపుణ్యా భివృద్ధికి, ఉపాధి భద్రతకు పెద్దపీట వేస్తోందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో యువత భవిష్యత్ కు భరోసా అను సదస్సును ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నా స్వస్థలమైన నంద్యాలలో భవిష్యత్ భారతాన్ని తీర్చిదిద్దే యువతీ యువకుల మధ్య ఈ సదస్సు ప్రారంభించడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తుంధోందని, రాష్ట్రం లో నైనా, దేశంలో నైనా శాశ్వత మార్పు రావాలంటే అది యువ శక్తి తోనే సాధ్యం అని, మా మంచి ఉమ్మడి ప్రభుత్వం యువత నైపుణ్యా భివృద్ధికి, ఉపాధి భద్రతకు పెద్ద పీఠ వేస్తోందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఒకప్పుడు రాయలసీమ అనగానే తీవ్ర వర్షాభావం, రైతుల కష్టాలు, ఉపాధి లేక వలసలు గుర్తుకొచ్చేవి. కానీ నేడు పరిస్థితులు మారాయని. మన ప్రాంతం కరువుతో పోరాడే స్థితి నుంచి అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని. పరిశ్రమల రాకతో రాయల సీమ ముఖచిత్రం పూర్తిగా మారిపోతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా-ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గ్లోబల్ ఇన్వెస్టర్లతో సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రాన్ని పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. రాష్ట్రానికి వస్తున్న భారీ పారిశ్రామిక పెట్టుబడుల ద్వారా స్థానిక యువతకు వేలాది ఉద్యోగావకాశాలు అందుబా టులోకి రానున్నా యనీ. రాజకీయాల్లో విలువలు, అభివృద్ధిలో పారదర్శకత ఉండాలని కోరుకునే నేటి తరం.. దేశ నిర్మాణంలోనూ బాధ్యతా యుతంగా భాగస్వామ్యం కావాలని. మీ ఓటు హక్కు ద్వారా సమాజ భవిత వ్యాన్ని మార్చే నాయకత్వాన్ని ఎన్నుకోండని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పిలుపు నిచ్చారు. విద్యార్థులతో ముఖాముఖి & వ్యవస్థాపకతపై సందేశం ప్రసంగం అనంతరం ఎంపీ విద్యార్థులతో నేరుగా సంభాషిం చారు. ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, స్టార్టప్ ఆలోచ నలు, ప్రాంతీయ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆమె వివరణాత్మక సమాధా ాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక యువ ఔత్సాహిక పారిశ్రా మికవేత్త, 'మీతో' (మీతో) యాప్ వ్యవస్థా పకుడు న్యాస పవన్ కృషిని ప్రత్యేకంగా అభినం దిస్తూ.."ఉద్యోగం కోరుకునే స్థాయి నుంచి పలువురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడమే నిజమైన విజయం; విద్యార్థులు స్టార్టప్‌లు, ఆవిష్క రణల వైపు ముందడుగు వేయాలి" అని పిలుపు నిచ్చారు. రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ "శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా తలపెట్టిన 'భవిష్య త్తుకు భరోసా' కార్యక్రమాన్ని మొట్ట మొదటిగా నిర్వహించడం మాకెంతో గర్వకారణం. యువత ఆలోచనలే దేశ నిర్మాణా నికి బలమైన పునాదులు. నేటి తరం విద్యార్థుల్లో అపార మైన ప్రతిభ, సరికొత్త దృక్పథం ఉన్నాయ న్నారు. వారికి సరైన మార్గదర్శకత్వం, చేయూత లభిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, మన నంద్యాల పార్లమెంట్ సభ్యు రాలు డాక్టర్ బైరెడ్డి శబరి విద్యార్థులకు, ముఖ్యంగా యువతులకు గొప్ప స్ఫూర్తిప్రదాతగా నిలుస్తున్నారన్నారు. గతంతో పోలిస్తే విద్యారం గంలో మౌలిక వసతులు, సాంకేతిక అవకాశాలు విప్లవాత్మకంగా మెరుగ య్యాయని. విద్యార్థులు



ఈ వనరులను సద్విని యోగం చేసుకొని సమాజ హితం కోసం తమ వంతు కృషి చేయాలి. యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ఇలాంటి వేదికలను కల్పిస్తున్న ప్రభుత్వానికి మా హృదయ పూర్వక కృతజ్ఞతలు.అన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. హేమంత్ రెడ్డి మాట్లాడుతూ "ప్రపం చంలోనే అత్యధిక యువశక్తి కలిగిన దేశం భారతదేశం. మన దేశ అభివృద్ధి, ఆర్థిక పరిపుష్టి పూర్తిగా యువత తీసుకునే నిర్ణయాలు, చూపే చొరవపైనే ఆధారపడి ఉన్నాయని, రాబోయే తరాల గమనాన్ని, గమ్యా న్ని తిరగరాయగల శక్తి ఒక్క యువతరానికి మాత్రమే సొంతం అన్నారు. రాష్ట్రంలో ఎన్నో ప్రముఖ విద్యాసంస్థలు ఉన్నప్ప టికీ, ఈ అవగాహన సదస్సును ప్రారంభిం చేందుకు మన కళాశాలకు ప్రాధాన్యతని చ్చినం దుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, సమస్య లను పరిష్కరించే నైపుణ్యాలను (Problem-solving స్కిల్స్) అలవర్చుకోవాలి. నిరంతరం నేర్చుకునే తపనను అలవర్చు కున్నప్పుడే ప్రపంచ పోటీని తట్టుకొని నిలబడగల రన్నారు. ఈ కార్యక్ర మంలో శ్రీ రామకృష్ణ పి జి కళాశాల డీన్ ఎ ఎస్ ప్రగతి, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే బుడ్డా దిగ్భ్రాంతి

ఆత్మకూరు సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం

ఆత్మకూరు వినాయక నిమజ్జనం సందర్భంగా బుధవారం కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై పాములపాడు మండలం ఎర్రగూడూరు గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందడం, మరో నలుగురు తీవ్రంగా గాయపడటంపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# మట్టి గణపతులకు గుంటూరు జై

-25 వేల విగ్రహాల తయారీ.. 50 శాతం మట్టి విగ్రహాలతోనే పూజలు



గుంటూరు, సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం

పర్యావరణ పరిరక్షణకు గుంటూరు నగరం మరో అడుగు ముందు కేసింది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రీన్ గణేష్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 55 పాఠశాలలకు చెందిన 25 వేల మంది విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాల్లో సుమారు 50 శాతం విగ్రహాలను వినాయక చవితి సందర్భంగా ప్రజలు పూజించడం పట్ల నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ హర్షం వ్యక్తం చేశారు.నవ గుంటూరులో భాగంగా ఈ నెల 11న నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గ్రీన్ గణేష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో నగరంలోని 55 పాఠశాలలకు చెందిన సుమారు 25 వేల మంది విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. విద్యార్థులు తయారు చేసిన విగ్రహాలకు కుటుంబాల నుంచి లభించిన ఆదరణ పర్యావరణహిత వినాయక చవితి దిశగా ప్రజల్లో మారుతున్న ఆలోచనా విధానానికి నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు.గ్రీన్ గణేష్ కార్యక్రమం విజయవంతంలో భాగస్వాములైన విద్యాసంస్థలు, అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మయూర్ అశోక్ ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ గణేష్ కార్యక్రమం ద్వారా సాధించిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు కంటే నగర ప్రజల నుంచి వచ్చిన స్పందనే తనకు మరింత సంతృప్తినిచ్చిందన్నారు. 25 వేల మంది విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతుల ద్వారా 25 వేల కుటుంబాల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలకు ప్రత్యామ్నాయం కల్పించగలిగామని తెలిపారు.మట్టి విగ్రహాల వినియోగం వల్ల నీటి వనరులు, భూమి కాలుష్యాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. వచ్చే ఏడాది నగరంలో 100 శాతం మట్టి విగ్రహాలతో వినాయక చవితి నిర్వహి ంచే లక్ష్యంతో ప్రజలు సహకరించాలని కోరారు. పర్యావరణంపై విద్యార్థుల్లో అవగాహన పెంచితే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు.

-విద్యార్థులే 'నవ గుంటూరు' అంబాసిడర్లు

గ్రీన్ గణేష్ కార్యక్రమంలో విద్యాసంస్థల సహకారం కీలకంగా నిలిచిందని కమిషనర్ తెలిపారు. ఉత్సాహవంతులైన విద్యార్థులను భవిష్యత్తులో 'నవ గుంటూరు అంబాసిడర్ల'గా గుర్తించి, వారి భాగస్వామ్యంతో క్షేత్రస్థాయిలో నగరపాలక సంస్థ కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నగరంలో గ్రీన్ బెల్ట్ పెంపు కోసం ఇప్పటికే 20 వేలకు పైగా మొక్కలు నాటినట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, కాలుష్యరహిత చెత్త సేకరణ కోసం ఈ-ఆటోలను అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. జాతీయ స్థాయి స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు రెండో స్థానం సాధించడంలో అధికారులు, పారిశుధ్య కార్మికుల తోపాటు నగర ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమైందన్నారు. తొలుత నగరానికి జాతీయ స్థాయిలో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ ర్యాంకు, గ్రీన్ గణేష్ కార్యక్రమం ద్వారా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సాధనలో కీలకపాత్ర పోషించిన కమిషనర్ మయూర్ అశోక్‌ను విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు అభినందించారు. అనంతరం కార్యక్రమంలో భాగస్వాములైన విద్యాసంస్థల ప్రతినిధులు, అధికారులు, మట్టి విగ్రహాలతో వినాయక చవితి నిర్వహించిన అపార్ట్‌మెంట్ వాసులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి. సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్‌ఈ సుందర్రామిరెడ్డి, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఈఓఐ ఎలిషా, ఎన్‌టీఆర్ స్టేడియం కార్యదర్శి వజ్జా రామకృష్ణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్, ఏఓ తిరుపతి నాయుడు, ఉపా సెల్ పీఓ సింహాచలం, ఎంఈఓలు ఖుద్దూస్, నాగేంద్రం, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ఆత్మకూరులో ప్రశాంత వాతావరణంలో వినాయక శోభాయాత్ర,నిమజ్జన వేడుకలు విజయవంతం





**-మూడు రోజులపాటు పూజలు అందుకున్న గణనాథులు**

**-మేళ తాళాలు, డప్పు వాయిద్యాల మధ్య గణనాథుని ఊరేగింపు**

**-ఎర్రగూడూరు వద్ద తెలుగు గంగ లో గంగమ్మ ఒడికి చేరుకున్న గణనాథులు**

**-గణేష్ శోభాయాత్రతో పట్టణంలో పండగలాగా గణనాథుడి యాత్ర**

**-ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ**



**పోలీసు బందోబస్తు**

**ఆత్మకూరు సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం**

పట్టణంతో పాటు గ్రామాల్లో మూడు రోజులపాటు గణనాథులకు విశేష పూజలు చేసి భక్తులు నిమజ్జనం వేడుకల సందర్భంగా బుధవారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో మొదటి గణనాథునికి విశేష పూజలు అందించి కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ ఏ. బేబీ, మండల తాసిల్దార్ రత్న రాధిక ఆత్మకూరు అర్బన్ సీఐ ఓ. మహేశ్వర్ రెడ్డి. ఎస్ఐ వెంకట నారాయణ రెడ్డి నా ఆధ్వర్యంలో జెండా ఊపి వినాయక నిమర్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఆత్మకూరు డిఎస్పి ఆర్. రామాంజి నాయక్ పర్యవేక్షణలో పురవీధుల నుంచి గణనాథుడు వరుస క్రమంలో నిమర్జనానికి బయలుదేరేందుకు అధికార యంత్రాంగం భారీ పోలీసు బలగాలను ఏర్పాటుచేసి పట్టణంలో పండగలాగా వినాయక చవితి నిమర్జనం వేడుకలు కొనసాగాయి



ముందుగా భక్తాదులు వినాయక చవితిని పురస్కరించుకొని పట్టణంతో పాటు గ్రామాల్లో ఆత్మకూరు ఎస్ఐ వెంకట నారాయణ రెడ్డి పర్యవేక్షణలో నిమజ్జన వేడుకలు కొనసాగాయి ఆత్మకూరు రూరల్ సీఐ, సురేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగు గంగ బ్రిడ్జిపై నిమజ్జన ఏర్పాట్లు పోలీసులు సిద్ధంగా ఉంచారు వరుస క్రమంలో ఆత్మకూరు పట్టణం నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు మండపాల్లో వినాయకులను ప్రతిష్టించి సకల విఘ్నాన తొలగించాలంటూ పల పత్ర పుష్పాలతో నైవేద్యం సమర్పించి గణనాధులకు విశేష పూజలు చేశారు. అత్యంత వైభవంగా అశేష భక్తజనం మధ్య నిమజ్జన కార్యక్రమం కన్నుల పండుగగా సాగింది. డ్రమ్స్, వైద్యాలు, డీజే సౌండ్ల మధ్య పట్టణంలో నిమజ్జన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. నిమజ్జనానికి తరలుతున్న విగ్నేశ్వరుని సకల విఘ్నాన తొలగించు స్వామి అంటూ భక్తులు అధిక సంఖ్యలో తిలకించి స్వామివారిని వేడుకున్నారు. నిమజ్జన కార్యక్రమం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు డిఎస్పి రామంజి






నాయక్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా సాగింది. ఈ నిమజ్జన వేడుకలు చూసేందుకు పాములపాడు ఆత్మకూరు మండలాలకు చెందిన భారీ స్థాయిలో వినాయక భక్తాదులు మహిళలు చిన్నారులు యువతి యువకులు గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు శాంతిభద్రతలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా తనదైన శైలిలో పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ పోలీస్ సిబ్బందికి వినాయక భక్తాదులు కమిటీ బృందాలు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు

# నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక నిమజ్జన కార్యక్రమాలను పరిశీలన







**-జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ఐకమత్యంతో, సోదరభావంతో, సంతోషకర వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలి**

**నంద్యాల సెప్టెంబర్ 16 వార్త సాక్ష్యం**

నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యలూరిమెట్ట, కొత్తపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్న వినాయక నిమజ్జన కార్యక్రమాలను జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ బుధవారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నిమజ్జన కార్యక్రమానికి హాజరైన ప్రజలతో మాట్లాడి, అందరూ ఐకమత్యంతో, సోదరభా వంతో, సంతోషకర వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం నిమజ్జన కార్యక్రమాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో జిల్లా ఎస్పీ మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారునిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లాఎస్పీ ఆదేశించారు. ప్రజల సహకారంతో వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపట్టింది.

# వెస్టిండీస్‌తో సిరీస్‌కు భారత జట్ల ఎంపిక.. కెప్టెన్లు, ఆటగాళ్లు వీరే

స్వదేశంలో వెస్టిండీస్‌తో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌లతో పాటు, ఇరానీ కప్ కోసం జట్లను భారత పురుషుల సెలక్షన్ కమిటీ బుధవారం ప్రకటించింది. ఈ సిరీస్‌ల కోసం పలువురు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పిస్తూ, కెప్టెన్సీలో కూడా కీలక మార్పులు చేసింది. వన్డే జట్టుకు యువ సంచలనం శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, టీ20 జట్టు పగ్గాలను శ్రేయస్ అయ్యర్‌కు అప్పగించారు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు చోటు దక్కింది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా, కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డితో పాటు గుర్‌నూర్ బ్రార్, అకిబ్ నబీ వంటి కొత్త ముఖాలకు ఈ జట్టులో అవకాశం లభించింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో యువ జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. తెలుగు ఆటగాడు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్ వంటి యువ ప్రతిభావంతులకు ఈ జట్టులో చోటు కల్పించారు. సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ వికెట్ కీపర్లుగా ఎంపికయ్యారు.మరోవైపు, రంజీ ట్రోఫీ ఛాంపియన్ జమ్మూ కాశ్మీర్‌తో జరిగే ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టుకు వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ నాయకత్వం వహిం చనున్నాడు. సర్ఫరాజ్ ఖాన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ జట్టులో పలువురు దేశవా ళీ స్టార్లు చోటు దక్కించుకు




న్నారు.ఆసియా క్రీడల జట్టులో మార్పులు గాయం కారణంగా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి జపాన్ టీ20, ఆసియా క్రీడలకు దూరమయ్యాడు. అతని స్థానంలో విప్రాజ్ నిగమ్‌ను ఎంపిక చేశారు. తొలుత ఆసియా క్రీడల జట్టులో ఉన్న నితీశ్ కుమార్ రెడ్డిని, వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు ఎంపిక చేయడంతో ఆసియా క్రీడల నుంచి తప్పించారు.

## జాతీయ గర్వం అహంకారంగా మారితే.. గెలుపుకు ప్రాధాన్యత ఉండదు: భారత్ ట్రోఫీ నిరాకరణపై మహమ్మద్ యూసఫ్

ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్థాన్ మంత్రి మోహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించేందుకు నిరాకరించడం తీవ్ర దుమారం రేపుతోంది. గత ఏడాది పురుషుల ఆసియా కప్ సమయంలోనూ భారత పురుషుల జట్టు నఖ్వీ నుంచి ట్రోఫీని తీసుకోకుండా సంచలన నిర్ణయం తీసుకుంది. తాజాగా భారత మహిళల జట్టు కూడా అదే బాటలో పయనించి నఖ్వీకి షాక్ ఇచ్చింది.దుబాయ్‌లో జరిగిన ఫైనల్ పోరులో శ్రీలంకపై 72 పరుగుల తేడాతో విజయం సాధించి భారత మహిళల జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. అయితే నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోకూడదనే నిర్ణయం వెనుక బీసీసీఐ ముందస్తు వ్యూహం ఉంది.ఈ ట్రోఫీ నిరాకరణ ఘటనపై పాకిస్థాన్ మాజీ దిగ్గజ క్రికెటర్ మహమ్మద్ యూసఫ్ సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించాడు. “జాతీయ గర్వం కాస్తా అహంకారంగా మారినప్పుడు, గెలుపునకు ఏమాత్రం ప్రాధాన్యత ఉండదు. జట్టు గెలవవచ్చు, కానీ వినయం లేని దేశం ఓడిపోయినట్టే” అని ట్వీట్ చేశాడు.



# స్పోర్ట్స్

## మూడో టీ20లో వైభవ్ సూర్యవంశీకి ఛాన్స్? అయ్యర్ మాటలతో పెరిగిన ఆసక్తి



ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్‌ను భారత్ 2-0తో కైవసం చేసుకుంది. దీంతో గురువారం జరిగే చివరి టీ20పై ఆసక్తి పెరిగింది. ఈ మ్యాచ్‌లో బెంచ్ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని టీమిండియా భావిస్తోంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలు చూస్తే యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి ఛాన్స్ దక్కే సూచనలు కనిపిస్తున్నాయి.రెండో టీ20లో భారత్ ఏడు వికెట్ల తేడాతో ఆఫ్ఘనిస్థాన్‌ను ఓడించింది. సంజూ శాంసన్ 22 బంతుల్లోనే 57 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. నితీశ్ కుమార్‌రెడ్డి మూడు వికెట్లు తీసి ఆఫ్ఘన్ బ్యాటర్లను కట్టడి చేశాడు.సిరీస్ ఇప్పటికే భారత్ సొంతం కావడంతో మూడో మ్యాచ్‌లో కొత్త ఆటగాళ్లను పరీక్షించనున్నట్లు అయ్యర్ చెప్పాడు. “అందరికీ వికెట్‌పై ఆడే అవకాశం ఇవ్వాలి. మ్యాచ్ ప్రాక్టీస్ కూడా అవసరం. అందుకే బయట ఉన్న ఆటగాళ్లకు ఛాన్స్ ఇవ్వడం మంచి అవకాశం” అని తెలిపాడు. దీంతో వైభవ్ సూర్యవంశీకి అవకాశం రావొచ్చనే ఆసక్తి మొదలైంది.టీ20 కెప్టెన్‌గా తన ఆరంభం కఠినంగా సాగిందని అయ్యర్ చెప్పాడు. గత ఫలితాల గురించి ఆలోచించకుండా ప్రస్తుత పరిస్థితిని ఆస్వాదించాలని పేర్కొన్నాడు. పరిస్థితులను స్వీకరిస్తేనే మెరుగ్గా రాణించగలమని చెప్పాడు.మరోవైపు నితీశ్ కుమార్‌రెడ్డి తన బౌలింగ్ వేగం పెరిగిందని చెప్పాడు. ఆల్‌రౌండర్‌గా ఎదగాలంటే అదనపు పేస్ అవసరమని భావించానని తెలిపాడు. శిక్షణలో చేసిన కృషి ఇప్పుడు ఫలిస్తోందని చెప్పాడు.

# నటి శ్రీదేవి చెన్నై ఆస్తి వివాదం- సుప్రీంకోర్టులో విచారణ







దివంగత నటి శ్రీదేవి కుటుంబానికి సంబంధించిన ఆస్తి వివాదం దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు చేరింది. చెన్నైలోని ఈస్ట్ కోస్ట్ రోడ్డులో ఉన్న 2.7 ఎకరాల భూమికి సంబంధించి దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, శ్రీదేవి భర్త బోనీ కపూర్, కుమార్తెలు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు వివాదాస్పద ఆస్తి విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) పాటించాలని ఆదేశించింది. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని ఇరువర్గాలకు సూచించింది. అవసరమైతే హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని మధ్యవర్తిగా నియమిస్తామని స్పష్టం చేసింది. మధ్యవర్తిత్వ పురోగతిని సమీక్షించేందుకు కేసు తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది. వివాదానికి కారణమైన ఈ భూమిని 1988 ఏప్రిల్ 19న శ్రీదేవి కుటుంబం కొనుగోలు చేసింది. అయితే, ఈ ఆస్తిలో తమకు వాటా ఉందని ఎంసీ శివకామి అనే మహిళ, ఆమె సోదరుడు పిటిషన్ దాఖలు చేశారు. గతంలో వీరి పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేయడంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ వాదనలు వినిపించగా, బోనీకపూర్ కుటుంబం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం జరిగిన క్రయవిక్రయాలపై ఇప్పుడు దావా వేయడం కాలపరిమితి చట్టం ప్రకారం చెల్లదని సింఘ్వీ పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం, ప్రస్తుతానికి వివాదాస్పద స్థలంలో యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది.

## గణపతి నిమజ్జనంలో సల్మాన్ ఖాన్ హుషారు.. నవ్వుతూ కెమెరాలకు పోజులు

బాలీవుడ్ ప్రముఖ నటుడు సల్మాన్ ఖాన్ తన సోదరుడు సోహైల్ ఖాన్ నివాసంలో నిర్వహించిన గణపతి నిమజ్జన వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వేడుకలో ఆయన ఎంతో ఉత్సాహంగా, చిరునవ్వుతో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. మంగళవారం సాయంత్రం ముంబై బాంద్రా వెస్ట్‌లోని సోహైల్ ఇంటికి చేరుకున్న ఆయన, అక్కడ వేచి ఉన్న ఫోటోగ్రాఫర్లకు చిరునవ్వుతో పోజులిచ్చారు. తలపాగా ధరించి, ప్రింటెడ్ జీన్స్, జాకెట్‌లో స్టైలిష్‌గా కనిపించిన సల్మాన్.. అక్కడ ఉన్న ఒక ఫొటోగ్రాఫర్‌ను చూసి సరదాగా నవ్వారు. అక్కడున్న ఒక చిన్నారితో పాటు ఆమె తల్లిదండ్రులతో కూడా ఆయన ముచ్చటించారు. గణపతికి హారతి ఇచ్చే క్రమంలో సల్మాన్ చిన్న పొరపాటు చేయగా, వెంటనే ఆయన సోదరి అర్పితా ఖాన్ దానిని సరిదిద్దారు. ఈ ఆసక్తికర దృశ్యం అక్కడున్న వారిని అలరించింది. ఖాన్ కుటుంబం ప్రతి ఏటా గణేశ్ చతుర్థి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తుంది. సల్మాన్ తండ్రి సలీం ఖాన్ ముస్లిం, తల్లి సుశీలా చరక్ (సల్మా) హిందూ, అలాగే సవతి తల్లి హెలెన్ క్రైస్తవ మతానికి చెందినవారు కావడంతో, ఈ కుటుంబం జరుపుకునే పండుగలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి. ఈ వేడుకల్లో సల్మాన్‌తో పాటు ఇలియా వంతూర్, నటుడు వరుణ్ శర్మ తదితరులు కూడా పాల్గొన్నారు. అనంతరం, సోహైల్ ఖాన్ నివాస ఆవరణలోనే ఏర్పాటు చేసిన ప్రత్యేక నీటి తొట్టిలో గణనాథుడి నిమజ్జనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



## హాలీవుడ్‌లో విజయ్ సేతుపతి 'మహారాజ' రీమేక్ హీరోగా స్టార్ నటుడు?




విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించిన తమిళ క్రైమ్ థ్రిల్లర్ 'మహారాజ' అంతర్జాతీయ స్థాయిలో మరో ఘనత సాధించింది. 2024లో విడుదలై ఘన విజయం అందుకున్న ఈ చిత్రాన్ని హాలీవుడ్‌లో రీమేక్ చేయనున్నారు. ఓ ప్రముఖ హాలీవుడ్ ఏజెన్సీ ఈ సినిమా రీమేక్ హక్కుల కోసం తమను సంప్రదించినట్టు నిర్మాత సుధన్ సుందరం స్వయంగా ధ్రువీకరించారు. ఈ సినిమా చైనాలో విశేషంగా ఆకట్టుకుని, బాక్సాఫీస్ వద్ద సుమారు రూ. 91.65 కోట్లు వసూలు చేసింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలోనూ మంచి ఆదరణ లభించడంతో హాలీవుడ్ దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలోనే రీమేక్ కోసం చర్చలు జరిగాయని నిర్మాత తెలిపారు. ఈ హాలీవుడ్ ప్రాజెక్టును ఓ ఏ-లిస్ట్ స్టార్‌తో తెరకెక్కించేందుకు ఏజెన్సీ ప్రయత్నాలు చేస్తోందని, వచ్చే ఏడాది చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఆయన వివరించారు. ప్రస్తుతం కథానాయకుడి పాత్ర కోసం హాలీవుడ్ స్టార్ మాథ్యూ మెక్ కొనాహే పేరు సోషల్ మీడియాలో ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే, నటీనటులు, స్టూడియో వంటి వివరాలను సంబంధిత ఏజెన్సీనే అధికారికంగా ప్రకటిస్తుందని సుధన్ సుందరం స్పష్టం చేశారు. నిథిలన్ స్వామి నాథన్ దర్శకత్వం వహించిన 'మహారాజ' చిత్రంలో, తన ఇంట్లో 'లక్ష్మి' అనే డస్ట్‌బిన్ కనబడటం లేదని ఓ బార్బర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కథ మొదలవుతుంది. ఆ తర్వాత ఊహించని మలుపులతో కథనం సాగుతుంది. ఈ చిత్రంలో అనురాగ్ కశ్యప్ ప్రతినాయకుడిగా నటించగా, సేతుపతి కుమార్తెగా నటించిన సంచన నమిదాస్‌కు ఉత్తమ సహాయ నటిగా జాతీయ అవార్డు లభించడం విశేషం.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.